సాక్షి
కాకినాడ

శుక్రవారం । 17 । జనవరి । 2025



ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష


జిక్కవోలు: శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయ పునర్నిర్మాణానికి బొలిశెట్టి సుబ్బారావు (గోకవరం మండలం యు.కొత్తపల్లి) గురువారం రూ.1,00,051 విరాళం సమర్పించారు.



రూ.1,00,121 విరాళం

దేవరపల్లి: స్థానిక శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దావర్తి కృష్ణమూర్తి, సత్యవతి దంపతులు గురువారం రూ.1,00,121 విరాళం అందజేశారు.

డెల్టాలకు 9,745 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 9,745 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ప్రభోత్సవం త్వరగా ముగించడంపై ఫిర్యాదు

అన్నవరం: కనుమ పండగ సందర్భంగా బుధవారం రాత్రి అన్నవరంలోని పురగిరి క్షత్రియుల రామకోవెలలో జరిగిన సత్యదేవుని ప్రభోత్సవాన్ని త్వరగా ముగించడంపై ధర్మకర్త సోము జోగురాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు గురువారం **లిఖిత పూర్వకంగా** ఫిర్యాదు చేశారు. సత్య**దేవుడు, అనంతలక్ష్మీ** సత్యవతీదేవి అమ్మవా**రిని భక్తుల** సందర్శనార్థం రాత్రి 8 గంటల **వరకూ ఉంచకుండా** రాత్రి 7.15 గంటలకే **ఊరేగింపుగా తీసుకుని** వెళ్లడంపై అసంతృప్తి **వ్యక్తం చేశారు. ఏటా** వస్తున్న ఆచారం ప్రకార**ం రామాలయం వద్ద** సాంస్కృతిక ప్రదర్శన**లు కూడా ఏర్పాటు** చేయడం లేదని పే**ర్కొన్నారు. ఏటా ఇలాగే** జరుగుతోందని, కనీసం **ఈసారైనా స్వామి,** అమ్మవార్లను రామకోవెల**లో ఎక్కువసేపు ఉం**చాల్సిందిగా అధికారుల**ను కోరామని తెలి**పారు. దానికి అధికారులు **అంగీకరించినప్పటికీ** ఎప్పటిలానే రాత్రి 7.1**5 గంటలకే స్వామి,** అమ్మవార్లను తీసుకుని **వెళ్లారని, ఆ తరువాత** స్వామి దర్శనానికి వచ్చి**న భక్తులు తీవ్ర నిరాశ** చెందారని తెలిపారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జోగురాయుడు కోరారు.

వచ్చే నెలలో సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు



కలెక్టర్ షణ్మోహన్‌ను అభినందిస్తున్న క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు

కాకినాడ సిటీ: వచ్చే నెల 15 నుంచి 28వ తేదీ వరకూ కాకినాడలో ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ జరగనుందని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ నిర్వహించాలంటూ ఆయన గతంలో ప్రతిపాదించారు. దీనికి సెంట్రల్ సివిల్ సర్వీసెస్ బోర్డు అంగీకరించింది. ఈ నేపథ్యంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్, ట్రస్ట్ ఫౌండర్, ఆదాయ పన్ను అధికారి రవిచంద్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి బి.శ్రీనివాస్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షణ్మోహన్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే తొలిసారిగా ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో జరగడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ పోటీలను కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్, జిల్లా అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన పక్కాగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో కాకినాడలో అంతర్జాతీయ టోర్నమెంట్లు నిర్వహించేందుకు కూడా కృషి చేస్తామని అన్నారు.

వేటకు వేళాయె..



తీరాన ఉన్న బోట్లు

పిఠాపురం: సంక్రాంతి సంబరాలు ముగిశాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతూ ఇప్పటి వరకూ ఇళ్లకు పరిమితమైన వారు తిరిగి ఎవరి పనుల్లో వారు క్రమంగా తలమునకలవుతున్నారు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12 నుంచి వేటకు విరామం ప్రకటించి, సంబరాల్లో మునిగి తేలిన మత్స్యకారులు కూడా ఐదు రోజుల అనంతరం తిరిగి తమ జీవన పోరాటం ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో ఒడ్డున ఉన్న బోట్లను, తెప్పలను సముద్రంలోకి చేర్చుకుంటున్నారు. వలలు, ఇతర వేట సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే సుదూర ప్రాంతాల్లో చేపల వేటకు కొంత మంది మత్స్యకారులు సముద్రం పైకి వెళ్లగా.. మిగిలిన వారు కూడా వేటకు ఉపక్రమిస్తున్నారు. ఐదు రోజులుగా బోసిపోయిన సముద్ర తీరం శుక్రవారం నుంచి చేపల క్రయ విక్రయాలతో కళకళలాడనుంది.

భీమేశ్వరాలయ నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దాత పుప్పాల అజయ్‌కుమార్ గురువారం రూ. 1,00,116లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు చెక్‌ను ఆలయ సీనియర్ సహాయకుడు సూరపువు రెడ్డి వెంకటేశ్వరరావు(వెంకన్నబాబు) చేతికి అందజేశారు.



నేతలకు మేత

- కోడి పందేలతో పండగే పండగ
- బరిలోనే పంపకాలు
- కూటమి ముఖ్య నాయకులకు రూ.50 లక్షలు
- ద్వితీయ శ్రేణి మండల స్థాయి వారికి రూ.2 లక్షలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పండగల వేళ బరి వేసుకో.. కోడిపందేలాడుకో.. గుండాట, జూద క్రీడలు మీ ఇష్టం .. మేం ఉన్నాంగా.. మిమ్మల్ని అడ్డుకునే వారే లేరు.. వచ్చినదాంట్లో నువ్వు ఇంత తీసుకో.. నాకు ఇంత ఇవ్వు.. ఇవీ సంక్రాంతి కోడిపందేల నిర్వాహకులతో కూటమి నేతలు చేసుకున్న ఒప్పందాలు. ఈ మేరకు పండగ ముగిసిన తర్వాత పంపకాలు మొదలవడంతో కూటమి నేతల ముంగిట్లో మామూళ్ల రూపంలో కాసుల వర్షం కురుస్తోంది. వారి స్థాయిని బట్టి రూ.లక్షలు, రూ.కోట్లలో నజరానాలు ముట్టాయనే మాట టీడీపీ శ్రేణుల నుంచే బాహాటంగా వినిపిస్తోంది.

తునిలో ఓ ముఖ్య నేతకు రూ.1.20 కోట్లు!

జిల్లాలోనే అత్యధికంగా తుని నియోజకవర్గంలో కూటమి నేతలకు భారీగా ముట్టిందని చెబుతున్నారు. పండగల సందర్భంగా ఈ నియోజకవర్గంలోని 60 బరుల్లో మూడు రోజుల పాటు 2,100 పందేలు జరిగాయి. నియోజకవర్గంలోని మూడు మండలాలు, తుని పట్టణంతో కలిపి రూ.15 కోట్ల వరకూ పందేలు సాగాయి. ఇందులో ఓ ముఖ్య నేతకు రూ.1.20 కోట్లు అందినట్లు సమాచారం. మండల స్థాయి నాయకులకు రూ.10 లక్షల చొప్పున మూడు మండలాలకు రూ.30 లక్షలు, గ్రామ స్థాయి నాయకులకు రూ.2 లక్షల చొప్పున పంపకాలు చేశారు. ఎస్.అన్నవరం, తేటగుంట, వెలమపేట, అల్లిపూడి, బెండపూడి, పెరుమాళ్లపురం గ్రామాల్లో పందేలు జోరుగా జరిగాయి.

పిఠాపురంలో రూ.కోట్లలో..

పిఠాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గొల్లప్రోలు నగర పంచాయతీ, పి.దొంతమూరు, చిత్రాడ, తాటిపర్తి, దుర్గాడ, వాకతిప్ప, నాగులాపల్లి, రమణక్కపేట, ఇసుకపల్లి తదితర గ్రామాల్లో 56 బరులు ఏర్పాటు చేశారు. మొత్తం 1,380 పందేలు రూ.9 కోట్ల మేర జరిగినట్లు సమాచారం. కొందరు నేతలకు రూ.కోటి వరకూ, మండల స్థాయి నాయకులకు రూ.5 లక్షల చొప్పున ఇచ్చారు. గ్రామ స్థాయి నాయకుడికి రూ.లక్ష చొప్పున మొత్తంగా రూ.కోటి వరకూ ముట్టజెప్పారు. ఇవి కాకుండా గ్రామాల్లోని చిన్నాచితకా నాయకులు రూ.1.50 కోట్ల వరకూ పంచుకున్నట్లు చెబుతున్నారు.

కాకినాడ రూరల్‌లో..

నియోజకవర్గంలో రూ.13 కోట్ల మేర పందేలు జరిగాయి. ఓ నేతకు రూ.25 లక్షల వరకూ ముట్టజెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కూటమిలోని రెండు ప్రధాన పార్టీలకు చెందిన కొందరు నేతలు పందేల్లో కమీషన్లకు కక్కుర్తి పడ్డారు. కాకినాడ, కరప మండలాల్లో పందేలు ఎక్కువగా జరిగాయి. కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 49వ డివిజన్ గైగోలుపాడులో కూడా పందేలు నిర్వహించారు. తిమ్మాపురం, సర్పవరం, కరప, గురజనాపల్లి తదితర గ్రామాల్లో కూటమి నేతలు దగ్గరుండి మరీ పందేలు ఆడించారు.

ఆ 3 నియోజకవర్గాల్లోనూ మామూళ్లే..

- **జగ్గంపేట, పెద్దాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో కూటమి ముఖ్య నేతలు కాకుండా కొందరు** కార్యకర్తలు కూడా మామూళ్లు తీసుకున్నారు.
- జగ్గంపేట నియోజకవర్గంలో 45 బరుల్లో 1,600 పందేలు జరిగాయి. మూడు రోజులూ కలిపి మొత్తం రూ.9.05 కోట్ల మేర పందేలు జరిగాయి. బరుల వద్ద గుండాటల నిర్వహణకు నియోజకర్గంలోని ఒకరిద్దరు రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ పాడుకున్నారు. జగ్గంపేట మండలం మల్లిపాకలో రోజుకు రూ.50 లక్షల మేర జూదం జరిగింది.
- పెద్దాపురం నియోజకవర్గంలోని 14 గ్రామాల్లో 42 బరుల్లో రూ.7 కోట్ల వరకూ పందేలు జరిగాయి. బరుల వద్ద కూటమి కార్యకర్తల హడావుడి కనిపించింది.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో 20 బరుల్లో జరిగిన పందేల ద్వారా రూ.కోటి వరకూ చేతులు మారాయి. కూటమికి చెందిన కొందరు రాజకీయ నాయకులే స్వయంగా పందేలు నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, ప్రత్తిపాడు, రాచపల్లి, కత్తిపూడి, శంఖవరం, అన్నవరం, రౌతులపూడి, ములగపూడి తదితర చోట్ల పందేలు జోరుగా జరిగాయి.

రత్నగిరిపై భక్తజనవాహిని

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- 2 వేల వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి గురువారం కిక్కిరిసింది. సంక్రాంతి పండగలకు స్వస్థలాలకు వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో భాగంగా మార్గం మధ్యలో సత్యదేవుని దర్శించుకుంటున్నారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ పెరిగింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని మొత్తం 40 వేల మంది దర్శించారు. సుమారు 2 వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 4 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు.

నిజరూప దర్శనం

ప్రతి రోజూ సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు స్వర్ణాభరణాలు, వజ్ర కిరీటాలు, పట్టు వస్త్రాలతో దర్శనమిస్తారు. ప్రతి గురువారం మాత్రం ఎటువంటి అలంకరణా లేకుండా నిజరూపాలతో దర్శనమిస్తారు. ఆవిధంగా సత్యదేవుని నిజరూప దర్శనం చేసుకున్న భక్తులు పులకించారు.

నేడు జన్మ నక్షత్ర పూజలు

సత్యదేవుని జన్మ నక్షత్రం మఖ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, ఉదయం 11 గంటలకు ఆయుష్య హోమం నిర్వహిస్తారు. వనదుర్గ అమ్మవారికి ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ చండీ హోమం నిర్వహిస్తారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

కాకినాడ క్రైం: జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు 11వ రోజయిన గురువారం కూడా నిర్వహించారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షించారు. ఈ పరీక్షలకు 657 మంది అభ్యర్థులు హాజరు కాగా 377 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించారు.

అదనపు ఎస్పీ బాధ్యతల స్వీకరణ



అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న దేవరాజ్ మనీష్

కాకినాడ క్రైం: జిల్లా అదనపు ఎస్పీగా ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్ మనీష్ కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం గ్రేహౌండ్స్‌లో పని చేస్తూ ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

అంబాజీపేటలో ఘనంగా ప్రభల తీర్థం



ప్రభలను దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

అంబాజీపేట: సంక్రాంతి సందర్భంగా అంబాజీపేట సెంటర్‌లో ఏటా ముక్కనుమ రోజున నిర్వహించే ప్రభల తీర్థం (చక్ర తీర్థం) గురువారం అత్యంత ఘనంగా జరిగింది. మాచవరంలోని రామ్‌ఘాట్‌లో వేంచేసియున్న శ్రీపార్వతీ రాజేశ్వరస్వామి, కందుల మల్లేశ్వరస్వామి, యువగణపతి ఆలయాల వద్ద నుంచి ప్రభలను పురవీధుల్లో గౌడ యువసేన యువకులు ఊరేగింపుగా అంబాజీపేట సెంటర్‌కు తీసుకొచ్చారు. అక్కడ కొలువుతీరిన ప్రభలను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన తీర్థానికి మండలంలోని పలువురు తరలివచ్చారు. ఎస్సై కె.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తీర్థం ముగిసిన అనంతరం ప్రభలతో గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, సినీ ఆర్కెస్ట్రా పలువురిని అలరించాయి. ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యానారాయణ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు ప్రభలను దర్శించుకున్నారు.



అంబాజీపేట సెంటర్‌లో కొలువుతీరిన ప్రభలు

రహదారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



హైవే భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంతిలాల్ దండే, శ్రీధర్ తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రహదారులపై ప్రయాణం చేసే క్రమంలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆ మేరకు అందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రవాణా, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సూచించారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకూ జరిగే భద్రతా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం ఆయన కాకినాడ వచ్చారు. స్థానిక ఆర్‌టీఓ కార్యాలయంలో జాతీయ రహదారుల భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వాహనాలు నడిపే వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమావళి, జాతీయ రహదారులపై వాహనాలు నడిపే క్రమంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆటో డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ చేపట్టాలన్నారు. రవాణా, పోలీస్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు తదితర శాఖల అధికారుల సమన్వయంతో పని చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. హెల్మెట్ ధారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా రహదారుల భద్రతపై యువతకు, ఆటో డ్రైవర్లకు, మహిళలకు విస్తృత స్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రవాణా శాఖ ఉప కమిషనర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రారంభించిన గుడ్ సమారిటన్ అంశంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించాలని కోరారు. వాహన చోదకులకు, యువతకు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమావళిపై ప్రత్యేక శిక్షణ చేపట్టేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. ఆటో డ్రైవర్లు, భారీ వాహనాలు నడిపే వారికి కూడా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.

గ్యాస్ వాటా కోసం అందరం ఉద్యమిద్దాం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మధు

కాకినాడ సిటీ: మన గ్యాస్ మన రాష్ట్రానికే దక్కాలనే డిమాండుతో వచ్చే నెల 1న కాకినాడలో సదస్సు నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. కాకినాడ పీఆర్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పుల్లో ఉన్న మన రాష్ట్రం అభివృద్ధికి.. కాకినాడ సముద్ర తీరంలో లభిస్తున్న చమురు, గ్యాస్ నిక్షేపాల్లో వాటా కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన గత ఏడాది జనవరి 7న సముద్ర గర్భం నుంచి ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమైందన్నారు. కృష్ణా – గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తో పాటు చమురు ఉత్పత్తుల విలువ లక్షల కోట్ల రూపాయలకు మించి ఉంటుందన్నారు. ఈ నిక్షేపాలు దేశ ఆర్థిక వ్యవస్థ స్వరూపాన్నే మార్చబోతున్నాయని, రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి ఇది చాలా కీలకమైనదని చెప్పారు. ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా స్థానికంగా లభ్యమయ్యే సహజ వనరులను ఉపయోగించుకునే హక్కు ఆ ప్రాంతానికే ఉంటుందనేది సహజ న్యాయ సూత్రమన్నారు. సహజ వనరుల ఉత్పత్తిలో ఆ రాష్ట్రానికి 50 శాతం కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం కూడా చెప్పిందని అన్నారు. మన తీరం నుంచి 1,500 కిలోమీటర్ల దూరాన ఉన్న గుజరాత్, మహారాష్ట్రలకు గ్యాస్ అక్రమంగా తరలిస్తూ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మధు విమర్శించారు. మన చమురు, గ్యాస్ నిక్షేపాల్లో అత్యధిక వాటా మనకే దక్కాలంటూ రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఏకగ్రీవంగా తీర్మానించినా కేటాయింపులు, ఆదాయంలో సగం పొందలేకపోతున్నామని మధు చెప్పారు. వచ్చే నెల 1న నిర్వహిస్తున్న సదస్సును ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

21, 22 తేదీలలో కోనసీమ క్రీడోత్సవాలు

అమలాపురం రూరల్: ఈ నెల 21, 22 తేదీలలో జిల్లా స్థాయిలో 'కోనసీమ క్రీడోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు మండల స్థాయిలో గెలుపొందిన 7, 8, 9 తరగతుల సుమారు 2,700 మంది విద్యార్థులకు జీఎంసీ బాలయోగి స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

బాలారిష్టాలు

- సత్యదేవుని సన్నిధిలో డిజిటల్ చెల్లింపుల్లో ఇబ్బందులు
- నత్తలా ఇంటర్‌నెట్ వేగం
- టిక్కెట్ల జారీకి ఎక్కువ సమయం
- తప్పనిసరి అవుతున్న నగదు లావాదేవీలు



డిజిటల్ పేమెంట్ కౌంటర్‌లో టిక్కెట్లు కొనుగోలు చేస్తున్న భక్తులు



పశ్చిమ రాజగోపురం వద్ద కనిపించీ కనిపించనట్టుగా ఉన్న డిజిటల్ పేమెంట్ కౌంటర్

అన్నవరం: సత్యదేవుని భక్తుల సౌకర్యార్థం రత్నగిరిపై ప్రారంభించిన డిజిటల్ చెల్లింపుల విధానానికి బాలారిష్టాలు ఎదురవుతున్నాయి. పశ్చిమ రాజగోపురం వద్ద డిజిటల్ పేమెంట్స్ కౌంటర్‌ను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.సుబ్బారావు ఈ నెల 2న ప్రారంభించిన విషయం తెలిసిందే. దీని ద్వారా ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే, క్రెడిట్, డెబిట్ కార్డులతో భక్తులు సత్యదేవుని వ్రతం, దర్శనం, నిత్య కల్యాణం, లక్ష్మీప్రయుక్త ఆయుష్య హోమం, ప్రత్యంగిర హోమం (అడ్వాన్స్), ఇతర సేవల టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు. రోజూ తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ కౌంటర్ ద్వారా డిజిటల్ పేమెంట్ల సౌకర్యం అందుబాటులో ఉంటోంది. పీఆర్‌ఓ కార్యాలయంలోని కౌంటర్ ద్వారా ఈ నెల 1 నుంచి ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకూ డిజిటల్ చెల్లింపుల ద్వారా టిక్కెట్లు జారీ చేస్తున్నారు.

కానరాని ప్రచారం

దేవస్థానంలో డిజిటల్ పేమెంట్ల సౌకర్యం ఉన్నట్లు భక్తులకు తెలిసేలా రత్నగిరి పైన కానీ, కొండ దిగువన కానీ ఎక్కడా ఒక ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే, మైకు ద్వారా కూడా ప్రచారం చేయడం లేదు. దీంతో చాలా మంది భక్తులకు డిజిటల్ చెల్లింపుల విధానం ఉన్న విషయం తెలియడం లేదు. పశ్చిమ రాజగోపురం వద్ద నగదు లావాదేవీల కౌంటర్, డిజిటల్ పేమెంట్ కౌంటర్ ఎదురెదురుగా ఉన్నాయి. అక్కడకు వచ్చాక మాత్రమే డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉందనే విషయం తెలిసిన కొంత మంది భక్తులు మాత్రమే అప్పటికప్పుడు దీనిని ఉపయోగించుకుంటున్నారు.

ఇంటర్‌నెట్‌తో సహనానికి పరీక్ష

డిజిటల్ పేమెంట్ల విషయంలో మరో ఇబ్బంది కూడా ఎదురవుతోంది. రత్నగిరిపై ఇంటర్‌నెట్ వేగం నత్తతో పోటీ పడుతోంది. ఫలితంగా ఒక్కో టిక్కెట్టు జారీకి 5 నిమిషాల సమయం పడుతోంది. దీంతో భక్తులు అసహనానికి గురవుతున్నారు. ఎక్కువ సేపు వేచి ఉండలేక, గత్యంతరం లేక నగదు ద్వారానే టిక్కెట్లు కొనుగోలు చేస్తున్నారు.

10 శాతమే..

డిజిటల్ పేమెంట్ల ద్వారా వస్తున్న రాబడి దేవస్థానం ఆదాయంలో 10 శాతం మాత్రమే ఉంటోంది. ఈ నెల ఒకటి తేదీ నుంచి పదో తేదీ వరకూ దేవస్థానానికి నగదు కౌంటర్ల ద్వారా సుమారు రూ.3 కోట్ల ఆదాయం రాగా డిజిటల్ పేమెంట్ల ద్వారా సుమారు రూ.30 లక్షలు మాత్రమే వచ్చింది. డిజిటల్ పేమెంట్లపై దేవస్థానం విస్తృత ప్రచారం చేస్తే ఈ ఆదాయం ఇంకా పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు ఇంటర్‌నెట్ వేగం కూడా పెంచాల్సిన అవసరం ఉంది. అలాగే, పశ్చిమ రాజగోపురం ముందున్న కౌంటర్ భక్తులకు పెద్దగా కనిపించడం లేదు. దీనిని ముందు వైపునకు మార్చాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

శతాధిక వృద్ధుల మృతి



సత్తెమ్మ (ఫైల్)

కపిలేశ్వరపురం: మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల నాయకుడు నక్కా సింహాచలం మాతృమూర్తి సత్తెమ్మ (102) గురువారం వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆమె తొమ్మిది మందికి జన్మనివ్వగా వారిలో ప్రస్తుతానికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సత్తెమ్మ మృతికి సంతాపాన్ని, సింహాచలానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



మాదాసు రావమ్మ(ఫైల్)

ఉంద్రాజవరం/తాళ్లరేవు: తూర్పు గోదావరి జిల్లా ఉంద్రాజవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా తాళ్లరేవు మాధవరాయునిపేట గ్రామాల్లో ఇద్దరు శతాధిక వృద్ధులు గురువారం మృతి చెందారు. ఉంద్రాజవరం గ్రామానికి చెందిన మృతురాలు మాదాసు రావమ్మ (106) భర్త రత్తయ్య 25 సంవత్సరాల క్రితం మృతి చెందారు. అప్పట్లో ఆయన రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారని మనవడు, ఆలిండియా చిరంజీవి యూత్ వైస్ ప్రెసిడెంట్ కటకం రామకృష్ణ తెలిపారు. రావమ్మకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, 11 మంది మనవలు, 27 మంది మునిమనవలు, 58 మంది ముదిమనవలు ఉన్నారు.



ఆనందరావు మృతదేహం

అలాగే, మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామంలోని మాధవరాయునిపేటకు చెందిన మృతుడు ఇరుసుమండ ఆనందరావు (105) చిన్నతనం నుంచీ కూలి పని చేసుకునేవాడు. తరువాత తాళ్ల తయారీ, చెప్పులు కుట్టే కార్మికుడిగా పని చేసేవాడు. గ్రామంలోని వారందరికీ తలలో నాలుకలా వ్యవహరించేవాడు. బ్రహ్మచారిగా జీవనం సాగించాడు. అతడి యోగక్షేమాలను కుటుంబ సభ్యులు చూసుకున్నారు.

పండగ సంతోషం ఆవిరి



ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గోపాలుడు చెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న బంధువులు



క్షతగాత్రులను 108 వాహనంలోకి ఎక్కిస్తున్న దృశ్యం

- ఒమ్మంగిలో టెంపో వ్యాన్ బోల్తా
- ఇద్దరు మృతి, 27 మందికి గాయాలు
- వీరిలో ఐదుగురికి తీవ్ర గాయాలు
- కాకినాడ నుంచి ధారపల్లి జలపాతానికి వెళ్తుండగా ఘోరం





కోమాకుల చంద్రావతి, బత్తుల సురేఖ మృతదేహాలు

ప్రత్తిపాడు రూరల్: సంక్రాంతి పండగను మూడు రోజులు అక్కాచెల్లెళ్లు, తోడల్లుళ్లు, వారి పిల్లలతో ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన ధారపల్లి జలపాతం వద్ద కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపి ఈ సంక్రాంతిని మరుపురాని తీపి జ్ఞాపకంగా మలచుకోవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా బంధువులందరినీ ఒక్కచోటకు చేర్చి ధారపల్లి జలపాతానికి టెంపో వ్యాన్‌ను బుక్ చేసుకుని పయనమయ్యారు. అయితే హఠాత్తుగా దూసుకొచ్చిన రోడ్డు ప్రమాదం వారి సంతోషాన్ని ఆవిరి చేసింది. మరో పది కిలోమీటర్ల ప్రయాణిస్తే వారు ధారపల్లి చేరుకుంటారు. ఇంతలో అతి వేగంతో వెళ్తున్న వాహనం ఒమ్మంగి గ్రామం దాటిన తర్వాత గోపాలుడు చెరువు (చీకటి తోట) వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టడంతో వారి ఆనందాన్ని ఆవిరి చేసి విషాదాన్ని మిగిల్చింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గోపాలుడు చెరువు వద్ద గురువారం మధ్యాహ్నం టెంపో వ్యాన్ బోల్తా పడింది. పోలీసులు అందించిన సమాచారం మేరకు...

కాకినాడలోని తూరంగికి చెందిన కోమాకుల శ్రీనివాసరావు ఇంటికి తోడల్లుళ్లు, వారి కుటుంబీకులు హైదరాబాద్, విశాఖపట్నం, మిర్యాలగూడ నుంచి సంక్రాంతికి వచ్చారు. వీరితోపాటు తూరంగి, తిమ్మాపురం గ్రామాలకు చెందిన 28 మంది బంధువులతో కలిసి కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ సెంటర్ నుంచి వినాయక ట్రావెల్స్‌కు చెందిన టెంపో వాహనాన్ని బుక్ చేసుకొని డ్రైవర్‌తో కలిసి 29తో ప్రత్తిపాడు మండలంలోని ధారపల్లి జలపాతాన్ని సందర్శించేందుకు గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న టెంపో వాహనం ప్రత్తిపాడు మండలంలోని ఒమ్మంగి గ్రామం దాటిన తర్వాత గోపాలుడు చెరువు (చీకటి తోట) వద్ద మలుపులో అదుపుతప్పి రోడ్డుకు ఆనుకొని ఉన్న చెట్టు దుంగను ఢీకొని పంట కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో తూరంగికి చెందిన కోమాకుల శ్రీనివాసరావు భార్య చంద్రావతి (40), తిమ్మాపురానికి చెందిన బత్తుల లక్ష్మీ సురేఖ (18) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్‌తో సహా మరో 27 మంది గాయపడ్డారు. వీరిలో విశాఖపట్నంకు చెందిన దొడ్డి అంజలి, తూరంగికి చెందిన కూమాకుల శేషారత్నం, కోమాకుల రామలింగేశ్వరరావు, కోమాకుల శ్రీనివాసరావు, హైదరాబాద్‌కు చెందిన కోడూరి సాయిరాం తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో 4 నుంచి 9 తొమ్మిది సంవత్సరాల లోపు చిన్నారులు ఎనిమిది మంది గాయాల పాలయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇతర వాహనాలపై ధారపల్లి వెళ్తున్న మరికొంత మంది యాత్రికులు, స్థానికులు తక్షణం స్పందించి వాహనంలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి స్థానిక పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం తమ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. క్షతగాత్రులను ప్రత్తిపాడు సీహెచ్‌సీ వద్ద ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గాయపడిన 27 మందిని కాకినాడలోనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సకాలంలో సహాయక చర్యలు చేపట్టడంతో ప్రాణనష్టం తగ్గింది. ప్రమాద సమయంలో వాహనంలో విలువైన బంగారు వస్తువులు, మొబైల్ ఫోన్లు వాహనంలోనే ఉండిపోయాయి. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాద తీవ్రతను తగ్గించిన భారీ దుంగ

గోపాలుడు చెరువు వద్ద ఉన్న పంట కాలువను ఆనుకొని భారీ దుంగ ఉంది. ధారపల్లి జలపాతాన్ని తిలకించేందుకు వెళ్తున్న టెంపో వాహనం ఆ ప్రాంతంలో అదుపు తప్పి నేరుగా పంట కాలువలో బోల్తా కొట్టి ఉంటే ప్రమాద తీవ్రత మరింత దారుణంగా ఉండేది. కాలువలో బోల్తా కొట్టే ముందు కాలువకు ఆనుకొని ఉన్న భారీ దుంగను వాహనం ఢీకొంది. దీంతో వాహనం నేరుగా కాలువలోకి వేగంగా బోల్తా కొట్టకుండా ఆ దుంగ నియంత్రించింది. ఇదే జరగకుంటే మృతుల సంఖ్య మరింత పెరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. పండగ వేళ ఇంతటి ఘోర ప్రమాదం జరగడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది.

మిన్నంటిన రోదనలు

కోమాకుల చంద్రవతి సంక్రాంతి పండగను ఉల్లాసంగా గడిపింది. మరింత సంతోషంగా తన కుటుంబ సభ్యులతో గడుపుదామని ధారపల్లి జలపాతానికి బయలుదేరగా ప్రమాదం రూపంలో ఆమెను మృత్యువు కబళించింది. ఆమె మృతి చెందడంతో ఆ బంధుగణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద మృతులు, క్షతగాత్రుల బంధువుల రోదనలు మిన్నంటాయి.

కుమార్తె మరణంతో తీవ్ర విషాదం

కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురానికి చెందిన బత్తుల సత్యనారాయణ, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారిలో మొదటి కుమార్తె లక్ష్మీ సురేఖ డిగ్రీ ద్వితీయ సంవత్సరం కాకినాడ పీఆర్ కళాశాలలో చదువుతోంది. రెండవ కుమార్తె సారిక దేవి 6వ తరగతి చదువుతోంది. సత్యనారాయణ తాపీ పని చేసుకుంటూ ఇద్దరి కుమార్తెలను చదివిస్తున్నాడు. ఇంతలో కుమార్తె లక్ష్మీ సురేఖ మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

ఆస్పత్రి వద్ద హాహాకారాలు



కాకినాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కాకినాడ రూరల్: ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం అచ్చంపేట జంక్షన్ వద్ద గల మెడికవర్ ఆస్పత్రికి అంబులెన్స్‌ల్లో క్షతగాత్రులను తరలించారు. తమ శరీర భాగాలకు తగిలిన గాయాల నుంచి వస్తున్న అధిక రక్త స్రవంతోనే ప్రాణ భయంతో హాహాకారాలు చేశారు. మొత్తం 28మంది ఆస్పత్రిలో చేరగా వారిలో 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండగా అంజలిదేవి, రామలింగేశ్వరరావు, సాయిరామ్, శేషారత్నం పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలియజేశారు. 20మంది గాయాలతో కోలుకుంటుండగా వీరిలో చిన్నారులు హాసిని, విక్కి, అమృత, హిమన్వి, సారిక, హర్ష, సితార, సాయి స్నేహిత ఉన్నారు. వైద్య నిపుణులు వీరికి సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రి యూనిట్ హెడ్ సుభాకర్ వైద్యసేవలను పర్యవేక్షిస్తున్నారు.

బంధువులు కన్నీరు మున్నీరు

క్షతగాత్రుల బంధువులు ఆస్పత్రి వద్ద కన్నీరు మున్నీరయ్యారు. తమ వారికి ఏమయ్యిందో అంటూ ఆస్పత్రి వద్ద రోదనలు చేస్తూ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పండగ కోసం తన బిడ్డ సోమశేఖర్ అత్తారింటికి కాకినాడ జగన్నాథపురం వద్ద గోపికృష్ణ కాలనీకి వచ్చారని విహార యాత్రకు వెళుతూ ప్రమాదానికి గురయ్యాడని తల్లి తిమ్మిశెట్టి భాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. సోమశేఖర్ తేరుకుంటున్నట్టు తెలుసుకుని ఊపిరిపీల్చుకున్నారు.

సురేఖ మృతితో తిమ్మాపురంలో విషాదం

బంధువులతో కలిసి సరదాగా విహార యాత్రకు వెళ్లిన తిమ్మాపురం గ్రామం పాత పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో నివాసం ఉంటున్న బత్తుల సురేఖ (18) మృతితో ఆమె కుటుంబం విషాదంలో మునిగిపోయింది. డిగ్రీ చదువుకుంటూ పండగ కోసం అమ్మమ్మ ఇంటికి వెళ్లిన సురేఖ మృతి గురించి తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పండగ పూట విషాదంలో మునిగిపోయారు.

నేటి నుంచి జాతీయ స్థాయి చెస్ పోటీలు



చెస్ క్రీడా ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ తదితరులు

పెద్దాపురం: స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు జాతీయ చెస్ చాంపియన్ షిప్–2025 పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. పోటీల నిర్వహణ ఏర్పాట్లను గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీఓ కె.శ్రీరమణి, రెవెన్యూ, పోలీస్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 28 రాష్ట్రాలకు చెందిన 1,239 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. చెస్ ఆర్బిటర్స్, వలంటీర్లు, క్రీడాకారుల తల్లిదండ్రులు సుమారు వెయ్యి మంది వస్తారన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, స్పోర్ట్స్ అథారిటీ అధికారి శ్రీనివాసకుమార్, చెన్నై చీఫ్ ఆర్బిటర్ పాల్ ఆరోగ్య రాజ్, పెద్దాపురం చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీవీ శర్మ, సురేష్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

తునిలో భారీ అగ్ని ప్రమాదం



తుని స్క్రాపు దుకాణంలో ఎగసి పడుతున్న మంటలు

తుని: స్థానిక జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న పాత ఇనుము సామానుల(స్క్రాప్) దుకాణంలో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణంలో అగ్ని కీలలు విస్తరించాయి. భారీగా మంటలు ఎగిసిపడి దుకాణంలో సర్వం కాలి బూడిదైంది. ఈ అగ్ని ప్రమాదంలో రూ. 10 లక్షల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానిక అగ్నిమాపక అధికారి రాముడు తెలిపారు. ఘటనా స్థలికి కూతవేటు దూరంలో ఎగ్జిబిషన్ ఉన్నా ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తుని, అన్నవరం, నక్కపల్లి నుంచి వచ్చిన ఫైర్ ఇంజిన్లతో మంటలను ఆర్పివేశారు. దీనిపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా సమగ్ర విచారణ చేపట్టి లోతుగా దర్యాప్తు అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అగ్నిమాపక అధికారి రాముడు వివరించారు.

పురుగు మందు తాగి మృతి



పెరవలి: భార్య కాపురానికి రావటం లేదని మనస్తాపం చెందిన వ్యక్తి పురుగుమందు తాగి ప్రాణాలు విడిచాడు. పెరవలి ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఖండవల్లి గ్రామానికి చెందిన పల్లేటి రవి (24) లంకమాల్లపల్లి గ్రామానికి చెందిన ఒక యువతిని 2021లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఒక అమ్మాయి పుట్టిన తరువాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావటంతో విడిగా ఉంటున్నారు. ఎన్నిసార్లు కాపురానికి రమ్మన్నా రాకపోవటంతో మనస్తాపం చెంది బుధవారం పురుగుమందు తాగి పంటచేలో పడిఉండటంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ఎస్.రాయవరం: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం తీరంలో గల్లంతైన కాకర్ల మణికంఠ(22) మృతదేహం గురువారం నక్కపల్లి మండలం చినతీనార్ల తీరం సమీపంలో పోలీసులు గుర్తించారు. ఎస్ఐ విభీషణరావు వివరాల మేరకు.. కాకినాడ జిల్లా ప్రతిపాడు మండలం సింహాద్రిపురానికి చెందిన మణికంఠ తుని మండలం లోవ కొత్తూరులో మేనమామ ఇంటికి వచ్చిన అతను బుధవారం రేవుపోలవరం తీరానికి వచ్చి గల్లంతైన సంగతి తెలిసిందే. తీరంలో మునిగిన సాత్విక్‌ను కాపాడబోయి మణికంఠ కొట్టుకుపోయాడు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి 'గాడ్' జన్మదిన వేడుకలు



పీఠంలో కొలువైన విజయదుర్గా అమ్మవారు



పీఠాధిపతి గాడ్

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) 89వ జన్మదిన వేడుకలు శుక్రవారం నుంచి పీఠంలో నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీఠం అడ్మినిస్ట్రేటర్ వి.వి. బాపిరాజు గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10 గంటలకు జ్యోతి వెలిగించడం, గోపూజ, లక్ష్మీగణపతి హోమంతో ప్రారంభమయ్యే జన్మదిన వేడుకల సందర్భంగా పీఠంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అరుణాచలేశ్వరుడి కల్యాణం

గాడ్ జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు తమిళనాడులోని అరుణాచల దేవస్థానం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అరుణాచలేశ్వరునికి ఆలయ సంప్రదాయంతో అభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు అరుణాచలేశ్వరుడు, అపితకుచాంబ దేవిల దివ్య కల్యాణం నిర్వహిస్తారు. 18న ఉదయం 10 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస పండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవిజయవేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహిస్తారు. 19న ఉదయం గాడ్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విజయ వేంకటేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వరసిద్ధి వినాయకుడు, భవానీ శంకరుడు, శ్రీరామచంద్రమూర్తి, శ్రీవిజయదుర్గాదేవి ఉత్సవ మూర్తులకు పుష్పయాగం నిర్వహిస్తారు.

19న పోస్టల్ స్టాంప్ ఆవిష్కరణ

గాడ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 19న జరిగే సభలో ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించనున్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఆర్.అనంతపద్మనాభరావు అధ్యక్షతన జరిగే సభలో అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టరు డాక్టర్ ఆకెళ్ల విభీషణశర్మ, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

సీటొస్తే నవోదయమే..

- ఉజ్వల భవిత.. ఉన్నత ప్రమాణాలు
- రేపు నవోదయ ప్రవేశ పరీక్ష
- హాజరు కానున్న 8,971 మంది విద్యార్థులు
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహణ



జవహర్ నవోదయ విద్యాలయం

ఇవీ వివరాలు

జిల్లా	పరీక్షా కేంద్రాలు	దరఖాస్తు చేసిన విద్యార్థులు
కోనసీమ	17	3,869
తూర్పుగోదావరి	07	1,439
కాకినాడ	15	3,663

రాయవరం: ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన, క్రీడలు, సాహస కృత్యాలు, పౌష్టికాహారంతో పాటు వివిధ రంగాల్లో అధునాతన శిక్షణకు జవహర్ నవోదయ విద్యాలయాలు వేదికగా నిలుస్తున్నాయి. వీటిలో ప్రవేశాల కోసం ఏటా వేలాది మంది విద్యార్థులు పోటీ పడతారు. ఒకసారి 6వ తరగతిలో ప్రవేశం పొందితే +2(ఇంటర్) వరకు విలువలతో కూడిన ఉచిత విద్య లభిస్తుంది. నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18న పరీక్ష నిర్వహించనున్నారు.

8,971 మంది విద్యార్థులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 80 సీట్లకు 8,971 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. కరోనా నేపథ్యంలో 2021లో 5,371 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోగా, 2022లో 10,741 మంది, 2023లో 8,779, 2024లో 8,506 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల అనంతరం విద్యార్థుల ఓఎంఆర్ షీట్లను మూల్యాంకనం కోసం ఢిల్లీకి పంపిస్తారు. అక్కడే విద్యార్థుల ఎంపిక జరుగుతుంది.

ఉమ్మడి జిల్లాలో 80 సీట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పెద్దాపురం నవోదయ విద్యాలయంలో 80 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 15, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 17, తూర్పుగోదావరి జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, డీవోలు, ఇన్విజిలేటర్ల నియామకం చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్స అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. 144 సెక్షన్ అమలవుతుంది.

80 ప్రశ్నలు..100 మార్కులు

పేపర్‌లో 80 ప్రశ్నలకు వంద మార్కులు కేటాయిస్తారు. ఒక్కో ప్రశ్నకు 1.25 మార్కులు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీలో 40 ప్రశ్నలకు 50 మార్కులు, గణితంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు, భాషా పరిజ్ఞానంలో 20 ప్రశ్నలకు 25 మార్కులు కేటాయించారు. విద్యార్థులు ఉదయం 10.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. 10.45 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. ఆలస్యంగా కేంద్రానికి చేరుకుంటే పరీక్ష రాసేందుకు అనుమతి ఉండదు.

విద్యార్థులకు సూచనలివీ..

విద్యార్థులు రెండు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక హాల్ టికెట్‌ను ఇన్విజిలేటరుకు అందించాలి. ఏదో ఒక గుర్తింపు కార్డును విద్యార్థి వెంట తీసుకు వెళ్లాలి. బ్లూ లేదా బ్లాక్ పెన్నుతోనే పరీక్ష రాయాలి. పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులు పాఠశాల యూనిఫామ్, లేదా సివిల్ డ్రెస్‌లో హాజరు కావచ్చు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకురాకూడదు.

ఏర్పాట్లు పూర్తి



నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో పరీక్షను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించే విషయంపై చర్చించాం. పరీక్షా కేంద్రాల సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేశాం. సెంటర్ లెవల్ అబ్జర్వర్లను నియమించి శిక్షణ ఇస్తున్నాం.

– కేఆర్ కృష్ణయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయ, పెద్దాపురం

డీఈవోలకు ఆదేశాలిచ్చాం



ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసేందుకు డీఈవోలకు ఆదేశాలిచ్చాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

– జి.నాగమణి, పాఠశాల విద్యాశాఖ, ఆర్‌జేడీ, కాకినాడ